వేధిస్తున్న కూలీల కొరత..!



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు
- పెరిగిన కూలి రేట్లు
- రైతులపై మరింత ఆర్థిక భారం

తాంసి: ఈఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. ఇప్పటికే పలువురు రైతులు విత్తనాలను నాటేందుకు పంట చేలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు పత్తి, సోయా, కంది విత్తనాలు వేశారు. ఒకేసారి పనులు ఊపందుకోవడంతో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడింది. వ్యవసాయ పనుల్లో వ్యవసాయ కూలీల అవసరం విపరీతంగా పెరిగింది. యంత్రాల ద్వారా చేపట్టిన మరికొన్ని పనులను కూలీల సాయంతో చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం పత్తి విత్తనాలు విత్తడం పనులు చేస్తున్నారు. విత్తనాలు విత్తేందుకు సరిపడా కూలీల దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్క ప్యాకెట్ పత్తి విత్తనాలు విత్తేందుకు రూ.350 నుంచి రూ.350 వరకు చెల్లిస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది పత్తి విత్తనాల ధరలు కొంత పెరిగి రైతులపై ఆర్థిక భారం పడుతుంది.

ఇతర ప్రాంతాల నుంచి..

వరుస వర్షాలతో గ్రామాల్లో రైతులు అందరు ఒకేసారి పత్తితో పాటు ఇతర విత్తనాలను విత్తడంతో కూలీలు కొరత ఏర్పడింది. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను ఆటోల ద్వారా తీసుకువస్తున్నారు. రైతులు ఆటో అద్దె చెల్లించి మరీ కూలీలను పంటచేలకు తరలిస్తూ పనులు చేయించుకుంటున్నారు. వర్షాలు అవసరం మేర కురుస్తున్నందున విత్తనాలు ఎలాంటి ఆటంకం లేకుండా మొలకెత్తే అవకాశం ఉంది. రైతులు విత్తనాలను వేసేందుకు తొందర పడుతున్నారు.

కొరతతో ఇబ్బంది



పత్తి విత్తనాలు వేయడం మొదలు చేతికి వచ్చే వరకు కూలీల కొరత ఉంటుంది. గతేడాది రూ. 200 ఒక ప్యాకెట్ విత్తనాలు వేసిన కూలీలు ఈఏడాది రూ. 300 పెంచారు. తప్పనిసరి కూలీల ద్వారానే పత్తి విత్తనాలు వేసే అవకాశం ఉండటంతో కూలీలు అడిగినంత ఇస్తున్నాం.

– ఇప్ప విఠల్, రైతు, తాంసి

పెరుగుతున్న కూలి రేట్లు



వ్యవసాయ పనులు చేసే కూలీల రేట్లు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువు, మందుల రేట్లతో పాటు కూలీల ధరలు పెరుగడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వర్షం కురిస్తే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది.

– గిజ్జ రామన్న, వడ్డాడి, రైతు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



బోథ్: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



తాంసి: మొక్కలు నాటుతున్న నాయకులు



ఇచ్చోడ: కేక్ కట్ చేస్తున్న నాయకులు

బోథ్: బోథ్, సొనాల మండలాల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బాబెరతండాలో నాయకులు, మహిళలు కేక్ కట్ చేశారు. బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రిలో మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సొనాల మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ఆలయంలో యాల్ల సుధీర్ రెడ్డి రూ. 10 వేలు, కార్తీక్ రూ. 5 వేలు విరాళం అందించారు.

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన సందర్భంగా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన అనిల్ అన్న అభిమాని, యువసేన నాయకుడు ఆడెపు శ్రీకాంత్ అన్నదాన నిర్వహించారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ అధ్వర్యంలో కేకు కట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

తాంసి: మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా రామేశ్వర ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్ రెడ్డి, కృష్ణ, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, కల్యాణ్, రాములు, లింగన్న పాల్గొన్నారు,.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నాయకులు భారీ కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సూభాష్, మాజీ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, పాండురంగ్, నర్వాడే రమేశ్, సాబీర్, వెంకటేశ్, రాథోడ్ ప్రవీణ్, అర్గుల గణేష్ పాల్గొన్నారు.



నేరడిగొండ: కేక్ కట్ చేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నధానం చేశారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఎమ్మెల్యే నిరంతరం కష్టపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కేదరేశ్వర్ రెడ్డి, అభిరామ్‌రెడ్డి, కిషన్, వామన్, ప్రకాష్, అబ్దుల్లా, దేవ్‌రావు, ప్రకాష్ రెడ్డి, పోచన్న, చంద్రకాంత్, నాగరెడ్డి పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నాయకులు కేట్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం టపాసులు కాల్చారు.

చిత్రం గీసి.. అభిమానం చాటి



ఎమ్మెల్యే చిత్రం గీస్తున్న రాజు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన చిత్రకారుడు గట్టు రాజు బోథ్ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఎమ్మెల్యే చిత్రం గీసి శుభాకాంక్షలు చెప్పడం ఆనందంగా ఉందన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, లఖంపూర్ మాజీ ఉప సర్పంచ్ పవార్ సంతోష్‌ల ఆధ్యర్యంలో అన్నదానం నిర్వహించారు. అనిల్ అన్న యువసైన్యం సభ్యులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ అంబేకర్ పండరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్, అనిల్ అన్న యువసైన్యం అధ్యక్షుడు ఏలేటి దేవేందర్ రెడ్డి, ఏలేటి రవీందర్ రెడ్డి, సాబ్లే ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాత్నాల: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విశ్వనాథ్ అన్నా రు. సోమవారం పార్డి(బి) గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన 11 దరఖాస్తులను స్వీకరించి, సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రికార్డు అసిస్టెంట్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ సుభాష్, ధరణి ఆపరేటర్ నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

జైనథ్: రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ ఆత్రం నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల భూ సమస్యలు దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల వారిగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో భూ సమస్యలకు సంబంధించి 531 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సదస్సులో మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్ రెడ్డి, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం భూ సమస్యకు పరిష్కార వేదిక అని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. సోమవారం మండలంలో బంద్రేవ్, బలన్‌పూర్, హర్కాయి గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నయబ్ తహసీల్దార్ హీరాలాల్, ఆర్ఐ నూర్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, కరుణకర్‌రెడ్డి, స్రవంతి, రమేశ్, భోజన్న, వికాస్ గౌతం పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న నళినిరెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: రిమ్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించా లని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్‌లో కార్మికులుగా పని చేస్తున్న మహిళలు సమాఖ్యలో చేరారు. కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడికి గురి చేస్తున్నారని, సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం రిమ్స్ మహిళా సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అనసూయ, కార్యదర్శిగా షహీనా, తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

అన్నదాతకు అందుబాటులో ‘రైతునేస్తం’



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



సిరికొండలో వీసీలో పాల్గొన్న రైతులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రైతులకు అందుబాటులో రైతు నేస్తం కార్యక్రమాలను తీసుకువచ్చిందని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కేస్లాపూర్, వాల్గొండ రైతు వేదికలకు మంజూరైన వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం కార్యక్రమం ప్రారంభించారు. రైతులకు వ్యవసాయంపై శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు అందించనున్నారని తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమాలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్, ఏఈ వోలు వీరా, వివేక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం

నేరడిగొండ: నేరడిగొండ రైతు వేదికలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘రైతు నేస్తం’ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నేస్తం కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా రైతులకు వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వసంత్, మందుల రమేశ్, వ్యవసాయాధికారి కృష్ణవేణి, ఎంపీవో లక్ష్మణ్, ఏఈవో శ్యామ్, సౌజన్య, వినోద్, రైతులు పాల్గొన్నారు.

సాత్నాల: రైతునేస్తం.. ప్రజల నేస్తం అని రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అడ్డిభోజారెడ్డి అన్నారు. భోరజ్ మండలంలోని సిర్సన గ్రామంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికలలో 1031 వీసీలను ఏర్పాటు చేశారన్నారు., ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, జైనథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగల విట్టల్, అష్రఫ్, ఏఈవో దీప్తి, ఉషన్న పాల్గొన్నారు

సిరికొండ: మండలంలోని సిరికొండ, లక్ష్మిపూర్, పోచంపల్లి రైతు వేదికల్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొన్నారు. రైతులకు శాస్త్రవేత్తలు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించారు., కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్ కుమార్, వ్యవసాయాధికారి శ్రద్ధరాణి, తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా రైతు నేస్తం..

గుడిహత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు స్థానిక రైతువేదికలో వీక్షించారు. మధ్యాహ్నం సీఎం ప్రసంగాన్ని వీక్షించే సమయంలో సాంకేతిక కారణాల కారణంగా ఫుల్ స్క్రీన్ వచ్చేలా లేదని చెప్పడంతో రైతులు నిరాశ చెందారు. రైతువేదికలో ఫ్యాన్లు లేక ఎలా కూర్చునేది? అంటూ అసహనం వ్యక్తం చేస్తూ.. బయటకు వెళ్లిపోయారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మమ అంటూ కొనసాగించారు.

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రైతునేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రైతులకు సాగులో సలహాలు, సూచనలు చేసేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్ రావు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రైతు వేదికలు సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: 1031 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం కార్యక్రమాన్ని మంగళవారం ఉట్నూర్, శ్యాంపూర్, తాండ్ర గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకార్ రెడ్డిలు పాల్గొని ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించారు. ప్రతీ మంగళవారం రైతు వేదికల్లో శాస్త్రవేత్తల ద్వారా పంట దిగుబడి, పంట రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేశ్, రైతులు పాల్గొన్నారు.



పాల్గొన్న పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సవర్గాం, బుగ్గారం గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే పర్యావరణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం, ఎంపీవో లక్ష్మణ్, టీబీ ఆఫీసర్ సుమలత, హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, శ్రీదేవి, నికిత, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లక్ష్మణ్ అ న్నారు. సోమవారం మండలంలోని సల్యాదలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో వర్షకాలంలో ప్రతిఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మలేరి యా, డయేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో నరేందర్ గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న రాథోడ్ నరేందర్

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా సంచార వైద్య వాహనం పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఐఈసీ వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా నిర్మూలనపై గ్రామాల్లో 45 రోజుల పాటు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిట్టబొంగరం ఆస్పత్రి వైద్యుడు ప్రతాప్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు సీజ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పాఠ్య పుస్తకాలు విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఈవో ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్యను పాఠశాలకు పంపించారు. గోదాములో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలను సీజ్ చేశారు.



గోదాంను సీజ్ చేస్తున్న ఎంఈవో సోమయ్య

కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్, కోకన్వీనర్ నిఖిల్, సిద్ధు, అభిరామ్, మనీష్, సాయినాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారుల భవిష్యత్‌ను నాశనం చేయొద్దు

ఇచ్చోడ: చిన్నారుల భవిష్యత్‌ను నాశనం చేయొద్దని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వీధుల్లో చెత్త ఏరుకుంటున్న బడీడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొంత మంది తల్లితండ్రులు తమ పిల్లలను బడీలో చేర్పించకుండా, వారితో చెత్త సేకరణ చేయిస్తున్నారని ఆరోపించారు. బడీడు పిల్లలను పాఠశాలకు పంపించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, సోషల్ వర్కర్ అశ్వీని, జివినోద్, సీఆర్పీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యానికి పాటుపడాలి

ఇచ్చోడ: మొక్కలు నాటి జీవ వైవిధ్యానికి పాటుపడాలని జీవ విద్య జిల్లా కోఆర్డినేటర్ గోపినాథ్ అన్నారు. సోమవారం మండలంలోని ముఖరా(కె)లో మొక్కలు నాటి మాట్లాడారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడుకునే బాధ్యత ప్రతీ పౌరుడు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. రోజురోజుకు ప్లాస్టిక్ వాడకం పెరుగుతుందని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సూభాష్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జె.అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజెడ్‌సీ, బీకాం (సీఏ), బీకాం (జనరల్), బీఏ కోర్సులు ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత గల ఎస్సీ విద్యార్థినులు ఈనెల 23 లోగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 87900 09838 సంప్రదించాలని కోరారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను కొనసాగించాలి

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను కొనసాగించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ అన్నారు. సోమవారం మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ జిల్లాపై పూర్తిస్థాయి అవగాహన ఉందన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, సర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్‌లు గెలువాలంటే ఉమ్మడి జిల్లాపై పట్టువున్న మంత్రి సీతక్కను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ డైరెక్టర్‌కు అస్వస్థత

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి నుంచి జ్వరం, విరోచనాలతో బాధపడుతున్నారు. దీంతో ఆయన సోమవారం రిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అనంతరం సాయంత్రం డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. పలువురు వైద్యులు, సిబ్బంది ఆయనను పరామర్శించారు.

చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన మండలంలోని తిప్ప గ్రామానికి చెందిన చౌదరి గణేష్ (50) అనే వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. గణేష్ గత కొన్ని నెలల నుంచి మద్యానికి బానిసయ్యారు. దీంతో భార్య చౌదరి లలితా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం మత్తులో ఉన్న ఆయన ఆదివారం పురుగుల మందు తాగాడు. ఇంటి చుట్టూ పక్కాల వారు గమనించి చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందారు.

కంచె తొలగించిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 68 సర్వే నంబర్‌లో ఇంటి కంచెను తొలగించి ప్లాట్‌ను అక్రమించేందుకు ప్రయత్నం చేయడంతో పాటు ప్లాట్ ఓనర్‌లను భయబ్రాంతులకు గురి చేసిన గొడ్డంల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన రాథోడ్ రవీందర్, బొడేవార్ చంద్రకాంత్‌లకు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 68 సర్వే నంబర్‌లో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలానికి వారు కంచె వేసుకున్నారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన గొడ్డంల శ్రీనివాస్ ఏప్రిల్ మాసంలో ఆ కంచెను తొలగించడంతో పాటు ప్లాట్ నాదినని బెదిరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

నేరడిగొండ: సర్కార్ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి భూమారెడ్డి అన్నారు. మండలంలోని తేజా పూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా సరస్వతిదేవికి పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చే యించారు., కొత్తగా చేరిన విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం మణిలత, శ్రీనివాస్ గౌడ్, పవన్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు’



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కై లాసనగర్: ప్రజాపాలన ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జోగు రామన్న వ్యాఖ్యలను ఖండించారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. లక్షల కోట్లు అప్పు మిగిల్చడం తప్పా.. ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. 18 నెలల్లోనే సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రభుత్వాన్ని ఓర్వలేకనే రామన్న తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు సంతోష్ రావు, నర్సింగ్, రాజేశ్వర్, శంకరయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

‘గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు’

సిరికొండ: గ్రామాల్లో గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ రాజు హెచ్చరించారు. మండలంలోని రాంజీగూడ గ్రామంలో సోమవారం పోలీసులు మీ కోసం కార్యక్రమంలో గిరిజనులకు గంజాయి సాగు, సైబర్ క్రైం, లోన్ యాప్స్, డయల్ 100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీసాయి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.